క్లుప్తంగా

ద్విచక్రవాహనం చోరీ



సీసీ కెమెరాలో నమోదైన ద్విచక్ర వాహన చోరీ దృశ్యం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో పార్క్ చేసి ఉన్న ఓ ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి చోరీ చేశారు. పట్టణంలోని నెహ్రూసెంటర్ ప్రాంతంలోని సత్యసాయి సెల్ వరల్డ్ యజమాని చెర్విరాల ప్రభాకర్ రోజు మాదిరిగానే సోమవారం రాత్రి షాపు బంద్ చేశాక తన పల్సర్ వాహనాన్ని అదే షాపు ఎదుట పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం షాపు వద్దకు వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. షాపులోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా వాహనం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా విచారణ చేపట్టారు.

కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు



గార్ల: మండలంలోని సీతంపేట ఎంపీటీసీ, నియోజకవర్గ బీజేపీ నాయకురాలు నాగమణి మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావుతో హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కిషన్‌రెడ్డి సూచించినట్లు నాగమణి తెలిపారు. బయ్యారం మండల అధ్యక్షుడు ఈసం వెంకటేశ్వర్లు, వీరన్న, నరేష్, తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ



పెద్దవంగర: కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను మంగళవారం ఎంపీపీ ఈదురు రాజేశ్వరీ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య, ఎస్ఆర్ఐ సునీల్ రెడ్డి ఉన్నారు.

అడ్మిషన్ గడువు పెంపు

మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ చాయిస్ బేస్డ్ క్రెడిట్ పద్ధతిలో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ గడువు పెంపు ఈనెల 31వరకు అవకాశం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, కోఆర్డినేటర్ సీహెచ్ మల్లేశం సోమవారం తెలిపాడు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందుటకు విద్యార్హత ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సుల్లో పాస్ అయిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 73829 29705 సంప్రదించాలన్నారు.

అక్షింతల పంపిణీ



సాక్షి నెట్‌వర్క్: అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలను రామభక్తులు మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం తమ ఇళ్లలో తలపై అక్షింతలు చల్లుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల సందర్శన



కేసముద్రం: మండలంలోని నర్సింహులగుడెం జీపీ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ కార్యాలయాలు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్, రైల్వేస్టేషన్, ఎస్‌బీఐ, పీహెచ్‌సీలను సందర్శించారు. సందర్భంగా హెచ్ఎం కొడిపాక రమేష్ మాట్లాడుతూ.. పాఠ్యాంశాలలోని అంశాలను బట్టి, ప్రత్యక్ష బోధనానుభవం కలిగించాలనే ఉద్దేశంతో 3,4,5వ తరగతుల పిల్లలతో ప్రభుత్వ సంస్థలను సందర్శించామన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ మంగళవారం తెలిపాడు.

విద్యాభివృద్ధికి ఫాతిమా కృషి



మహబూబాబాద్ అర్బన్: ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేస్తున్న తస్లీమా



గూడూరు: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్: మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన ఫాతిమా షేక్ గొప్ప సామాజిక సంఘ సంస్కర్త అని మానుకోట సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా మంగళవారం కార్యాలయంలో ఫాతిమా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గూడూరు: అణగారిన కులాల మహిళల విద్యాభివృద్ధికి జ్యోతిబాపూలే దంపతులతో కలిసి పాటుబడిన మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ అని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో మంగళవారం హెచ్ఎం సుజాత అధ్యక్షతన ఫాతిమా షేక్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ శోభన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కోడెం రజిత, మోకాళ్ల వెంకన్న, మండల వెంకన్న, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: చదువుల తల్లి ఫాతిమాను మైనార్టీ ముస్లిం సోదరీమణులు ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించాలని సబ్ రిజిస్ట్రార్ మహ్మద్ తస్లీమా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆల్ అన్సారీ యూత్, మైనార్టీ ఫోరం ఆధ్వర్యంలో ఫాతిమా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇందుభారతి, మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఇంతియాజ్ నదీమ్ ఖాన్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి

మహబూబాబాద్ రూరల్: విద్యార్థినులు ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలని షీటీం ఏఎస్సై ఆనందం అన్నారు. ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో మండలంలోని పర్వతగిరి జెడ్పీ హై స్కూల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు ఆపద సమయంలో డయల్ 100, షీటీం నంబరును సంప్రదించాలన్నారు. ప్రత్యేకంగా చిన్నపిల్లలకు తల్లిదండ్రులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మీద అవగాహన కల్పించాలన్నారు. 1930, పోక్సో చట్టాలు, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. షీటీం వాట్సాప్ నంబర్లు 87126 56935, 79011 42009 తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటారన్నారు. సదస్సులో హెచ్ఎం శ్రీరాములు, ఉపాధ్యాయుడు నట్టి రవి, షీటీం అరుణ, రమేష్, మౌనిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షీటీం ఏఎస్సై ఆనందం

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న బృందం

మహబూబాబాద్ అర్బన్: నేటి ఆధునిక కాలంలో విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకొని అన్నిరంగాల్లో ముందుండాలని నూకల రామచంద్రారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. మై భారత్ వికసిత్ భారత్ అనే అంశంపై నెహ్రూ యువ కేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో బి.నవ్య జిల్లాస్థాయి విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ యస్.రంగారెడ్డి, అధ్యాపకులు రాజేందర్, సత్యనారాయణ, అశోక్, అలువాల తేజస్వి, సుజిత్, చింతల అన్వేష్ పాల్గొన్నారు.

నల్లబెల్లం, గుడుంబా పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 20క్వింటాళ్ల నల్లబెల్లం, 100 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ చిరంజీవి మంగళవారం తెలిపాడు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కురవి మండలంలోని భద్రుతండా, తుల్సియా తండ, లచ్చిరాం తండా ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఖమ్మంకు చెందిన షేక్ సైదులు, మహబూబాబాద్ మండలానికి చెందిన భూక్య సురేష్, భద్రు తండాకు చెందిన మూడు జగన్, మూడు బాబుపై కేసు నమోదు చేసి అశోక్ లేలాండ్ వాహనం సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఎస్సై హరీశ్, ఎక్సైజ్ ఎస్సై మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన బెల్లం చూపిస్తున్న పోలీసులు

సంఘాల క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లికుదురు: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై, సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ అధ్యాపకుల అసోసియేషన్ 475 సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి సమ్మెట సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించాడు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసోసియేషన్ సభ్యులు నాయిని వీరేందర్, లైబ్రేరియన్ అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకులు అశోక్, అసోసియేషన్ అధ్యక్షుడు వేముల రవీందర్, ప్రధాన కార్యదర్శి రవి కిరణ్, కోశాధికారి సుశీల పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం..

నెల్లికుదురు: నాయీ బ్రాహ్మణులంతా ఏకతాటిపై నడవాలని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, యాకనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మండల కమిటీ కృష్ణ, మౌనేందర్ ఆధ్వర్యంలో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కల్లు గీత సంఘం క్యాలెండర్..

కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై కె.క్రాంతికిరణ్ మంగళవారం సంఘం కార్మికులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించాడు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరిరెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, యాదగిరి, అనిల్, కృష్ణ, రామచంద్రు, వెంకన్న, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

పాతపెన్షన్ కోసం ఉద్యమం

డోర్నకల్: పాతపెన్షన్ అమలు కోసం ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఎంప్లాయీస్ సంఘ్ డోర్నకల్ బ్రాంచ్ సెక్రెటరీ బషీర్ అలీ తెలిపాడు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలో బషీర్ అలీ మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు తెలిపాడు. దీక్షలో సంఘ్ డోర్నకల్ బ్రాంచ్ చైర్మన్ మాంజీ, కోశాధికారి కె.రాజు, వైస్ చైర్మన్లు బాజీ షహీర్, సైదేష్, అసిస్టెంట్ సెక్రెటరీలు సీహెచ్ రాజు, దిలీప్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుమేర్‌చంద్ జైన్, తారాచంద్, ఎల్లావుల హరికృష్ణ, స్వామి, యాకయ్య, లక్ష్మణ్, ప్రవీణ్, సీపీఎం నాయకులు బొమ్మన అశోక్‌కుమార్, దాసరి మల్లేశం సంఘీభావం తెలిపారు.



దీక్షలో కూర్చున్న ఉద్యోగులు

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలంలోని పెనుగొండకు చెందిన ముదిగిరి బీరయ్య ఈనెల 7వ తేదీన మండలంలోని ఉత్తర తండా జీపీ పరిధిలోని గుర్రాలగుట్ట తండా వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్రగాయాలు కాగా ఎంజీఎంకు తరలించారు. హైదరాబాదుకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బాధితుడి భార్య లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

తొర్రూరు రూరల్‌లో..

తొర్రూరు రూరల్: ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకొని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన బోడపెల్లి శ్రీకాంత్(32)కు భార్య పావనితోపాటు కుమారుడు ఉన్నారు. ఈక్రమంలో శ్రీకాంత్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య పుట్టింటిక వెళ్లింది. ఇదేక్రమంలో ఈనెల 6న మద్యం మత్తులో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పు పెట్టుకున్నాడు. కాగా శరీరమంతా కాలిపోవడంతో వెంటనే వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

సంక్షిప్త సమాచారం

క్రీడలతో మానసికోల్లాసం

చిన్నగూడూరు: క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్సై సంతోష్ కుమార్ పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని పగిడిపల్లిలో నిర్వహిస్తున్న పీపీఎల్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఎస్సై మంగళవారం ప్రారంభించాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్ పాల్గొన్నారు.

నీటి మళ్లింపు అన్యాయం

కురవి: ఎస్సారెస్పీ కాల్వ నీళ్ల మళ్లింపు అన్యాయమని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్న అన్నారు. మంగళవారం సీరోలు మండల కేంద్రంలో ఉన్న గుండ్లకుంట చెరు భూముల్లోకి ఎస్సారెస్పీ కాల్వ నీళ్లు పోకుండా అడ్డుకోవడాన్ని పరిశీలించాడు.

ఆర్థికసాయం

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన పొడుగు సోమక్క కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. విషయం తెల్సుకున్న గ్రామానికి చెందిన పృథ్వీయూత్ ప్రతినిధులు ముత్యం శ్రీనివాస్‌గౌడ్, బత్తుల రమేష్, పుల్లూరు రాజు, గోపగాని అశోక్, వేముల సందీప్, పూనెం వీరస్వామి సుధాకర్‌లు రూ.6 వేల ఆర్థికసాయం అందించారు.

మత్స్యకార్మికులను ఆదుకోవాలి

మహబూబాబాద్: జిల్లాలోని మత్స్యకార్మికులను ఆదుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోడుగు శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో పది ఎకరాల స్థలాన్ని వెంటనే మత్స్యశాఖకు అప్పగించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో పిడుగు వెంకన్న, రాంమూర్తి, ఉప్పలయ్య, వెంకన్న, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఆఫీసర్ క్లబ్ ఆవరణలో మంగళవారం రియల్ ఎస్టేట్ మీడియేటర్స్ అండ్ రియల్టర్స్ యూనియన్ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. రియల్టర్స్ కమిటీకి కన్వీనర్‌గా పిట్టల గోపాల్, మీడియేటర్స్ కమిటీ కన్వీనర్‌గా మాదరబోయిన యాకన్నను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తీగల దుర్గేష్, పద్మారావు, కాలేరు మురళీ, అశోక్, కుమార్, చాంద్ పాషా, రవి, రాము, నాజర్ పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతుల నిలయం భారత్

నెహ్రూసెంటర్: విభిన్న మతాలు, కులాలు, భాషలు, సంస్కృతులకు భారతదేశం నిలయమని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహా అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. మహంకాళి హరిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సైదులు, జగంగం ఉప్పలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం



కేసముద్రం: సావిత్రిబాయి పూలేను విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని బాంసెఫ్ జాతీయ నాయకుడు భీమ్లానాయక్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మహిళా టీచర్లను సన్మానించాడు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, వీరన్న, సదానందం, రామయ్య, వెంకన్న పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు మంగళవారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ బాధిత కుటుంబానికి 50కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశాడు.

దీపాదాస్ మున్షీని కలిసిన శ్రీకాంత్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి మంగళవారం హైదరాబాదులో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపాడు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని ఇల్లెందు బైపాస్ రోడ్డులో నివాసం ఉండే వడియాల సంతోష్ అదృశ్యం కాగా అతడి భార్య శోభారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై మంగళవారం తెలిపాడు. సంతోష్ ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడ: ఏజెన్సీ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడ సర్పంచ్ మల్లెల రణధీర్ అన్నారు. పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన డిజిటల్ డెమో సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ భద్రయ్య, బీజేపీ నాయకులు నవీన్ నాయక్, మునేందర్, మధు పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



తొర్రూరు: శివయాడ్ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షురాలు పల్లకొండ రజిత ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో అనాథ ముస్లిం విద్యార్థులకు దుప్పట్లు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, హెచ్‌జేఆర్ ఎస్‌డీ సెంటర్ ప్రతినిధి తిరుపతిరెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాస్టర్ల కమిటీ ఎన్నిక

మరిపెడ: మండల కేంద్రంలో మండల పాస్టర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ప్రెసిడెంట్‌గా దావీదు, వైస్ ప్రెసిడెంట్ దేవరాజ్, సెక్రటరీగా దేవాసాయం, జాయింట్ సెక్రటరీ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రామాచారి, భాస్కర్, ప్రసాంనాయక్, పీటర్, జాషువా ఎన్నికయ్యారు.

గోదాదేవికి మంగళహారతి





గార్ల/డోర్నకల్: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం గోదాదేవి అమ్మవారి ఎదుట శ్రీ, ఓం, వేంకటేశ్వరస్వామి నామాలు ఆకారంలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పబ్బిశెట్టి తరంగిణి, పుల్లఖండం ఉమ, రమాదేవి, మణిమాల, అర్చకుడు కేఎల్ఎన్ చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పని చేస్తాం

మహబూబాబాద్ అర్బన్: ముదిరాజ్ కులస్తుల సంక్షేమానికి రాజకీయాలకు అతీతంగా పని చేస్తామని మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా దాతల సహకారంతో ముదిరాజ్ విద్యార్థులకు పుస్తకాలు, సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం రాష్ట్ర నాయకుడు కేవీ రమణ మాట్లాడుతూ.. నిరుపేద ముదిరాజ్ విద్యార్థులకు విద్య, ఉద్యోగాల పరంగా న్యాయం జరగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరుత వెంకటేశ్వర్లు, చొప్పరి శ్రీనివాస్, దుండి శ్రీనివాస్, అశోక్, పరమేశ్వర్, నిరంజన్, యాకయ్య, మురళి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పులి దేవేందర్

నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలి



నెల్లికుదురు: ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ

నెల్లికుదురు: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రభుత్వం విధించిన సమయంలోపే డేటా ఎంట్రీ కార్యక్రమం పూర్తి అయ్యేవిధంగా చూడాలని తొర్రూరు ఆర్డీఓ నర్సింగరావు అధికారులను ఆదేశించాడు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న డేటా ఎంట్రీని పరిశీలించాడు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ శేషాద్రి డిప్యూటీ తహసీల్దార్ తరంగిణి పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

పెద్దవంగర: ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఆర్డీఓ నర్సింహరావు అన్నారు. మంగళవారం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో చేపట్టుతున్న ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించాడు. పెద్దవంగర మండలంలోని అన్నిగ్రామాల నుంచి మొత్తం 9,474 దరఖాస్తులు రాగా, 3,041 ఆన్‌లైన్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీఓ సత్యనారాయణ, ఆర్ఐ లస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి

మరిపెడ రూరల్: మండల కేంద్రంలోని 2024 క్యాలెండర్‌ను పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుడితి ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించాడు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కీసర రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్, బాధ్యులు లింగయ్య, రామ్మోహన్, కరుణాకర్, భీమా, లెనిన్, సృజన, రజిత, విజయలక్ష్మి, జ్యోతి, వెంకన్న పాల్గొన్నారు.

పెద్దవంగర: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందుంటుందని సంఘం మండల శాఖ అధ్యక్షుడు గొట్టిముక్కుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పీఆర్టీయూ క్యాలెండర్‌ను పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం కళాధర్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి రమేష్ కుమార్, నాయకులు క్షీరసాగర్, రవికుమార్, అంజయ్య, యాకుబ్ పాషా, వెంకన్న, ఇంద్రసేనారెడ్డి, నరేందర్‌రెడ్డి, సురేష్, శ్రీను, సునీతరాణి, తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

దంతాలపల్లి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్టీయూ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరవెల్లి మహేందర్‌రెడ్డి అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాగిరి చంద్రశేఖర్, కాంప్లెక్స్ హెచ్ఎం వేణుమాధవరెడ్డి, మధుసూదన్, గుర్రం వెంకన్న, శ్యాంసుందర్‌రెడ్డి, ఆగయ్య, వీరస్వామి, యాకమల్లయ్య పాల్గొన్నారు.

లంబాడీలకు చైర్మన్ పదవి ఇవ్వాలి

కురవి: లంబాడీలకు కురవి వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ పదవి ఇవ్వాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దారవత్ వెంకన్ననాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వీరభద్రస్వామిని ఆరాధించే ప్రజలు అధికంగా గిరిజనులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నందులాల్ నాయక్, నాగేష్, సేవ్యా నాయక్, రాందాస్ పాల్గొన్నారు.